నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | ఏప్రిల్ 21, 2024 | www.navatelangana.com

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని బీఆర్ఎస్ నాయకుడు బిట్టు శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని గుండెపెల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. గ్రామంలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తిరుపతి, గోపాల్, శేఖర్, సుధాకర్, గణేష్, భద్రయ్య, గంగాధర్ పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలకు ఐదుగురు విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. అలాగే ఇటీవల గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి పోటీ పరీక్షలు నిర్వహించారని, పరీక్షల్లో శ్రీనిధి, రిత్విక్, సాయికృష్ణ, ఎస్.నవదీప్, అద్వంత్ ప్రతిభ చూపి ఎంపికయ్యారన్నారు. పాఠశాల నుంచి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.



హజ్ యాత్రకు వెళ్లేవారు నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హజ్ యాత్రకు వెళ్లే వారు నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు మౌలనా ముఫీ ఇలియాజ్ అహ్మద్ హామీద్ ఖస్మీ అన్నారు. శనివారం జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో యాత్రకు వెళ్లే వారి కోసం సెంట్రల్ గార్డెన్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి మాస్టర్ ట్రైనర్ సయ్యద్ మజర్ ఖస్మీతో కలిసి ఆయన పాల్గొన్నారు. యాత్రికులు పాటించాల్సిన నిబంధనలు, హజ్‌లో చేయకూడని అంశాలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు అహ్మద్ హామీద్ ఖస్మీ మాట్లాడుతూ ముస్లిములకు హజ్ యాత్ర ఎంతో పవిత్రమైందన్నారు. ఈ యాత్రను ఎంతో నియమంతో చేయాల్సి ఉంటుందన్నారు. యాత్రకు వెళ్లే వారి కోసం శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. విహార యాత్రకు వెళ్తున్నట్టుగా కాకుండా మనస్సుల్లో అల్లాహ్ నామస్మరణతో యాత్రకు బయల్దేరాలని సూచించారు. హజ్ సొసైటి తరపున ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ హజ్ సొసైటి అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తవక్కల్, నిర్మల్ అధ్యక్షుడు షేక్ హయత్, జావిద్ హుస్సేన్, అబ్దుల్ రహేమాన్, మహ్మద్ అసీఫ్, అమీమ్ షరీఫ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీడీఓ అల్బర్ట్ అధ్యక్షతన 2023-24 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ సురేందర్ మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బంది పనులను సక్రమంగా నిర్వహించాలని, ప్రతి ఒక్కరికి వంద రోజుల పని కల్పించాలన్నారు. ఎస్ఆర్‌పీ ప్రదీప్ మాట్లాడుతూ మండలంలో గత సంవత్సరం ఉ201 పనులకుగాను రూ.2.39 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. తనిఖీలో భాగంగా 12 మంది అధికారులకు షోకాజు నోటీసులు ఇచ్చారు. రూ.16,800 రికవరీ, అధికారులకు రూ.20వేల జరిమానా విధించినట్టు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి కృష్ణమూర్తి, ఎంపీఓ గంగాసింగ్, ఏపీఓ సతీష్, బీఆర్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మాజీ జెడ్పీ చైర్‌పర్సన్



నవతెలంగాణ-నిర్మల్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వల్లంకొండ శోభ సత్యనారాయణగౌడ్ జిల్లా కేంద్రంలోని తమ నివాసంలో శనివారం బీజేపీలో చేరారు. వీరికి నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రస్తుతం జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ముచ్చటగా మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధిక మెజార్టీతో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలో సైతం అధిక సంఖ్యలో పార్లమెంటు సీట్లు సాధిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ - కాగజ్‌నగర్

పట్టణంలోని పెట్రోల్ పంపు ఏరియాకు చెందిన అల్లం సత్యనారాయణ(51) జీవితంపై విరక్తితో శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం..మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లల వివాహం కాగా భార్యతో ఉంటున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో ఇంట్లో ఒంటిపై టర్పెంటాయిల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. మృతుడి సోదరుడు సదానందం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అనుమతి ఉండదు...సంక్షేమం పట్టదు..!

- విచ్చలవిడిగా వెలుస్తున్న ఇటుక బట్టీలు
- కార్మికులకు సౌకర్యాలను కల్పించడంలోనూ నిర్లక్ష్యం
- నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పట్టించుకోని అధికారులు

ఎలాంటి అనుమతి ఉండదు..ఎవరినీ అడగాల్సిన అవసరం లేదు. ఏదైనా లాభదాయక వ్యాపారం చేయాలంటే..యథేచ్ఛగా చేసుకోవచ్చు. ఇదీ జిల్లాలో ఏండ్లుగా జరుగుతున్న తంతు. జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా ఇటుక బట్టీలు వెలుస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. నిబంధనలు పాటించకపోయినా..అక్కడ పనిచేస్తున్న కార్మికులకు కనీస సౌకర్యాలు లేకపోయినా పట్టించుకోవడం లేదు. ఫలితంగా కాలుష్యంతో పాటు కార్మికులు సైతం వెట్టిచాకిరి చేయాల్సి వస్తోంది. పనిచేస్తున్న కార్మికులకు సంబంధించి అనుమతి తీసుకోవడం.. వారికి సౌకర్యాలు కల్పించడం వంటివేమీ కనిపించడం లేదు. ఫలితంగా కార్మికులు అసౌకర్యాల మధ్యనే పనులు చేయాల్సి వస్తోంది. మరోపక్క అధికార యంత్రాంగం వీటిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టి నిబంధనలు కఠినతరం చేయాల్సిన అధికారులు మామూలుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ రూరల్

జిల్లాలో ఇటుకబట్టీలకు కొదువలేకుండా ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. మైనింగ్, రెవెన్యూశాఖల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉన్నా అలాంటివేమీ పట్టించుకోవడం లేదు. ఫలితంగా పంట పొలాలు, మైదాన ప్రాంతాలతో పాటు ఏజెన్సీ ఏరియాలోనూ ఇటుకబట్టీలు పెడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో గ్రామాలకు సమీపంలోనే వీటిని ఏర్పాటుచేయడంతో వాతావరణం కలుషితమై ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. వీటి నుంచి వెలువడే పొగ, దుమ్ము దూళి కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే సమీపంలోని చెరువులు, అటవీ ప్రాంతాల నుంచి మట్టి తరలిస్తూ నిబంధనలు కాలరాస్తున్నారు. ఆయా శాఖలతో పాటు పంచాయతీల అనుమతులు కూడా తీసుకోవడం లేదు. వ్యాపారమే పరమావధిగా భావిస్తూ నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా ఆయాశాఖల అధికారులు అటు వైపు దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి.



ఆదిలాబాద్ శివారు ప్రాంతంలో నిర్వహిస్తున్న ఇటుక బట్టీ

సౌకర్యాలు కరువు..!

ఇటుకబట్టీలల్లో పనిచేస్తున్న కార్మికులకు వివిధ రకాల సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. జిల్లాలో ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను ఇక్కడకు తీసుకొస్తూ వారితో పనులు చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఎంత మంది కార్మికులు పనిచేస్తున్నారో వారి వివరాలతో పాటు వారిని ఇక్కడకు తీసుకొచ్చిన మధ్యవర్తుల వివరాలతో ఆయా బట్టీల యజమానులు కార్మికశాఖ వద్ద నమోదు చేయించాల్సి ఉంటుంది. కానీ కొందరు మినహా అనేక మంది ఇటుకబట్టీల యజమానులు ఈ నిబంధనలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. మరోపక్క ఇటుకబట్టీల వద్ద కార్మికులకు నివాసం ఉండేందుకు షెడ్డు నిర్మాణం, తాగునీరు, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స పెట్టెలు తదితర సౌకర్యాలను కచ్చితంగా కల్పించాల్సి ఉంటుంది. ఒకే దగ్గర కనీసం 20మంది పిల్లలు ఉంటే తప్పనిసరిగా అక్కడ పాఠశాల ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. లేదంటే సమీపంలోని బడిలో వారిని చేర్పించాల్సి ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో కార్మికులకు నిబంధనల మేరకు సౌకర్యాలు ఉన్నాయా..? లేదా అనేది అధికారులు తెలుసుకోవాల్సి ఉండగా..అలాంటివేమీ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఫలితంగా కార్మికులు అసౌకర్యాల మధ్యనే పనులు చేయాల్సి వస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లాలో ఇటుకబట్టీల అనుమతులు, కార్మికులకు సౌకర్యాల కల్పన విషయమై మైనింగ్, రెవెన్యూ అధికారులను ఫోన్లో సంప్రదించగా.. వారు స్పందించకపోవడం గమనార్హం.



అభ్యర్థుల ఖర్చుల వివరాలు కచ్చితంగా నమోదు చేయాలి

- పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల ఖర్చుల పరిశీలకులు సమీర్ నైరంతర్య



నవతెలంగాణ-నస్పూర్

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీల ఖర్చుల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల ఖర్చుల పరిశీలకులు సమీర్ నైరంతర్య అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్‌తో కలిసి ఆర్‌డీఓలు, సహాయ రిటర్నింగ్, నోడల్, పోలీసు అధికారులు, సహాయ ఎన్నికల ఖర్చుల పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలు, సమీకృత కంట్రోల్ రూమ్ అధికారులు, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ ప్రతినిధులు, ఫ్లయింగ్, స్టాటిస్టికల్, వీడియో సర్వేయలెన్స్, వీడియో పరిశీలన బృందాలు, ఎన్నికల విభాగం అధికారులతో ఎన్నికల ఖర్చుల వివరాల నమోదు, పర్యవేక్షణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఖర్చుల పరిశీలకులు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచార కార్యక్రమంలో భాగంగా చేసే ప్రతి ఖర్చును తప్పనిసరిగా లెక్కించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై అందే ఫిర్యాదులు, ప్రచారం కొరకు అందిన దరఖాస్తులను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్ణీత సమయంలోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు నియమించిన ప్రత్యేక బృదాలు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, సి- విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి 100 నిమిషాల్లోగా పరిష్కరించాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఎన్నికలలో చేసే ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలోని చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని, తనిఖీ ప్రక్రియను కచ్చితంగా వీడియో తీయాలని పేర్కొన్నారు. ఎన్నికలలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వినియోగించే నగదు, మద్యం, కానుకల తరలింపును నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కనీస సౌకర్యాలతో పాటు దివ్యాంగులు, వయోవృద్ధులు, గర్భిణుల కొరకు ర్యాంపు, వీల్‌ఛైర్స్ సదుపాయం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రకటనల కొరకు సువిధ ద్వారా అందిన దరఖాస్తులను ఎంసిఎంసి సభ్యులు పరిశీలించి సకాలంలో అనుమతి మంజూరు అయ్యేలా పర్యవేక్షించాలని తెలిపారు. ఎన్నికల ఫిర్యాదుల కొరకు సమీకృత కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 24గంటలు అందుబాటులో ఉంటుందని, సి-విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు.

ప్రశ్నించే గొంతుకలను రక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిది

- టీఏజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్
- 'అలుపెరగని పోరాటం' పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం దేశంలో ప్రశ్నించే గొంతుకులను అణగదొక్కే ప్రయత్నం జరుగుతోందని, వాటిని రక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ అధ్యక్షతన ప్రబీర్ పుర్కాయస్థ ఆంగ్లంలో రాసి బోడపట్ల రవీందర్‌చే తెలుగులోకి అనువాదం చేయబడ్డ 'అలుపెరుగని పోరాటం' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. దీనికి బండారు రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రబీర్ పుర్కాయస్థ జర్నలిజం ద్వారా ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపితే ఆయనపై ఉపా కేసు పెట్టి అరెస్టు చేయడం దారుణమన్నారు. దేశంలో పది సంవత్సరాల్లో ఇటువంటి సంఘటనలు ఎన్నో జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ సాయిబాబా, ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకుడు స్టాన్ స్వామి అరెస్టు ఈ కోవ కిందికి వస్తాయన్నారు. మీడియాపై కూడా పాలకులు దాడి చేయడం దారుణమన్నారు. ప్రపంచంలో గొప్ప ఛానల్ బిబిసి గుజరాత్ అల్లర్లపై డాక్యుమెంటరీ విడుదల చేయగా ఈడి అధికారులతో బెదిరింపులకు పాల్పడి ఛానల్ మూసివేతకు కారణం కావడం భారత్ పాలకుల గొప్పతనం కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. ఎన్డీటీవీ, దహిందూ లాంటి పత్రికలు కూడా పాలకుల దాడికి గురయ్యాయని తెలిపారు. ఇందిరాగాంధీ సమయంలో ప్రకటిత ఎమర్జెన్సీ విధిస్తే ప్రస్తుతం దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందన్నారు. మూడోసారి మోడీ వస్తే రాజ్యాంగం కూడా కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యువత ఇటువంటి వాటిని ప్రశ్నించే గొంతుకలుగా తయారు కావాలన్నారు. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలు కూడా లౌకిక వాదాన్ని అనుసరిస్తున్నాయని, మతపరమైన రాజ్యం ఎప్పుడు కూడా అభివృద్ధి చెందదన్నారు. పాలకులంటే భయపడకుండా నేరుగా ప్రశ్నించే ప్రబీర్‌ను ప్రభుత్వాలు అరెస్టు చేసి మిగతా వారిని భయపెట్టే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. రాజ్యాంగం ఇచ్చిన భావ ప్రకటన స్వేచ్ఛ దేశంలో కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించే వారు ఉంటేనే ప్రభుత్వాల నుండి పేద ప్రజలకు ఫలాలు అందుతాయని అన్నారు. కుమురం భీం జిల్లా పేరులోనే ఒక ప్రశ్నించే వీరుడి పేరు ఉందని, బ్రిటిష్ ప్రభుత్వానికి ఎదురొడ్డి పోరాడిన గొప్ప వీరుడు భీమ్ అన్నారు. 70 పదుల వయసులో ప్రభుత్వానికి లొంగకుండా ప్రబీర్ జైలులో ఉన్నాడని, ఆయనకు మద్దతుగా బయట పోరాటం పోరాట గడ్డనుండే ప్రారంభం కావాలని పేర్కొన్నారు. ఉపా చట్టం కింద కేసులు పెట్టడం ఆపాలేని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆర్.మహేష్ 'పాటనే నేనవుతా' అని పాడిన పాట ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టీకానంద్, కార్తీక్, టిఏజీఎస్ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాలశ్రీ, శ్రీనివాస్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నికోడే రవీందర్, అంబేద్కర్ సంఘ నాయకుడు అశోక్ మహల్కార్, బీసీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతి పటేల్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిప్ప సురేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు చాప్లే సాయిరాం, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, పంచాయతీ సెక్రటరీల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ, నాయకులు కృష్ణమాచారి, ముంజం ఆనంద్, శ్రీనివాస్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం నిఖిల్ పాల్గొన్నారు.



అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వేగవంతం చేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చేపట్టవలసిన అభివృద్ధి పనులను పరిశీలించి అవసరమైన వాటిని వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని, మంజూరైన నిధులతో ఇప్పటి వరకు గుర్తించిన పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, మూత్రశాలలు, సౌచాలయాలు, అదనపు గదుల నిర్మాణ పనులను చేపట్టాలని తెలిపారు. పనులు పురోగతి ఫొటోలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయడంతో పాటు నివేదిక రూపొందించి అందించాలని తెలిపారు. విద్యాశాఖ అధికారులు నిత్యం అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తూ త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, జిల్లా విద్యాధికారులు, మండల విద్యాధికారులు, సహాయ ప్రాజెక్టు అధికారులు సమన్వయం చేసుకుంటూ మే 20గా పనులు పూర్తయ్యే విధంగా చూడాలని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలో ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస వసతులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. తాగునీరు, ఫ్యాన్లు, నీడ, విద్యుత్ సరఫరాతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాలుగా గుర్తించబడిన ప్రభుత్వ పాఠశాలలో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | ఏప్రిల్ 21, 2024 | www.navatelangana.com

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ నాయకుల చేరిక

నవతెలంగాణ-నార్నూర్

బీఆర్ఎస్ నాయకులు పలువురు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఉట్నూర్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, అనార్‌పల్లి మాజీ సర్పంచ్ రాథోడ్ శేషారావ్‌తో పాటు 150 మంది పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు ఆయన తెలిపారు. కాంగ్రెస్‌లో కోఆప్షన్ సభ్యులు దస్తగిర్, తెలంగాణ జేఏసీ మాజీ చైర్మెన్ ఉత్తం రాథోడ్, అన్నాభావు సాతే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, దళిత రత్న అవార్డు గ్రహీత నర్సింగ్ మోరే, సహకార సంఘం డైరెక్టర్ దుర్గె కాంతారావ్, మాజీ ఉప సర్పంచ్ దాదే అలీ, కోర్రల మహేందర్, మహమ్మద్ ఖురేషి, షేక్ హుస్సేన్, మన్సూర్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీఆర్ఎస్ గడప గడపకు ప్రచారం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



మండలంలోని మాలేబోరిగాం, అంకాపూర్, గ్రామ పంచాయతీలోని గుండంలొద్ది గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేపట్టారు. ఈ ప్రచారంలో ఆత్రం సక్కు అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకుడు కుమ్ర రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు రోడ్లు, మురుగు కాలువలు, రైతులకు ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పించిన ఘనత బీఆర్ఎస్‌దేనని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో ఆత్రం సక్కుని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ పరమేశ్వర్, మాజీ సర్పంచులు ఆత్రం యాదవరావు, సిడాం లక్ష్మణ్, దుర్వ రాంచందర్, పెందోర్ గంగారాం, కొడప మాధవరావు, కుమ్ర మోతీరాం, సిడం గణపతి, కుమ్ర రాజు పటేల్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం సైన్యంతో ఆదివాసులపై దాడులు

- రాష్ట్ర శిశుసంక్షేమ, పంచాయత్ రాజ్ శాఖామాత్యులు సీతక్క
- దక్షిణ రాష్ట్రాల్లో బార్డర్ పోలీసులతో దాడులు
- అమరుల త్యాగాలు వృధాకానివ్వం
- కాంగ్రెస్ హయంలోనే ఆదివాసులకు సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే హరీశ్‌రావు మాటలు బూటకం



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బార్డర్ పోలీసులతో ఆదివాసులు నివసిస్తున్న అడవుల్లో దాడులకు పాల్పడుతోందని రాష్ట్ర శిశు, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ అలియాస్ సీతక్క ఆరోపించారు. శనివారం మండలంలోని స్థానిక అమరవీరుల స్తూపం వద్ద అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆనాడు భూమి, భుక్తి కోసం పోరాడి అమరులైన ఆదివాసుల త్యాగాలు వృధా పోనివ్వమన్నారు. వారు చేసిన త్యాగాల ఫలితంగా నేడు ఆదివాసులకు ఐటీడీఏ, సంక్షేమ పథకాల చట్టాలు అమలుల్లోకి వచ్చాయన్నారు. 1987లో అనేక మందికి ఉద్యోగాలు కల్పించడం జరిగిందని గుర్తు చేశారు. మాజీ ఎంపీ సోయం బాపురావు 1981లో కాల్పులకు కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని అనడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దానికి క్షమాపణ కోరిందన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి తనపై చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవన్నారు. వసూలుకు పాల్పడితే ఆధారాలు చూపాలని దానికి తాను ఏ శిక్షకైనా సిద్ధంగా ఉన్నానని సవాల్ చేశారు. ఆతనిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఇక కేంద్ర ప్రభుత్వం దక్షిణ ఉద్యమాల ఆదివాసులు నివసిస్తున్న రాష్ట్రాలపై కేంద్ర బార్డర్ పోలీసులచే ఎన్‌కౌంటర్‌ల పేరిట దాడులు చేస్తోందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం ఆదివాసీ చట్టాలను హరిస్తోందన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఖనిజాల తవ్వకాలకు జీఓలను మార్చేసి కార్పొరేట్ సంస్థ కంపెనీలకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. సోయం బాపురావు, గోడం నగేష్, ఆత్రం సక్కులు రాజకీయాల్లో రాక ముందు కాంగ్రెస్ తెచ్చిన రిజర్వేషన్‌లతోనే ఉపాధ్యాయ ఉద్యోగాలు చేయలేదా అని ప్రశ్నించారు. ఇప్పుడేమో కాంగ్రెస్‌పై బురద జల్లడం మానుకోవాలని హితవు పలికారు. కేంద్రప్రభుత్వం మైనింగ్‌ల పేరిట ఆదివాసుల గ్రామాలను ఖాళీ చేస్తోందని విమర్శించారు. అమరవీరుల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, నిర్మల్ జిల్లా అధ్యక్షులు శ్రీహరిరావు, రాష్ట్ర కార్యదర్శి సత్తు మల్లేష్, బోథ్ ఇన్‌చార్జి ఆడే గజేందర్, రేఖా నాయక్, బజార్ హత్నూర్ జెడ్పీటీసీ, మల్లెపూల నర్సయ్య, కిసాన్ మొర్చా జిల్లా కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, ఆదివాసీ నాయకులు మెస్రం నాగ్‌నాథ్, పుర్క బాపురావ్, సార్మేడిలు చిన్నూ పటేల్, వెంకట్‌రావ్ పటేల్ పాల్గొన్నారు.

కాల్పులపై కాంగ్రెస్ క్షమాపణ కోరుతోంది



1981 ఏప్రిల్ 20న పోలీసులు జరిపిన కాల్పులకు 43 ఏండ్లు పూర్తయ్యాయి. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన సంఘటనకు కాంగ్రెస్ తరపున క్షమాపణ కోరుతున్నాం. కాంగ్రెస్ నాయకులకు శ్రద్ధాంజలి ఘటించే హక్కు లేదని సోయం బాపురావు అనడం సరికాదన్నారు. కాంగ్రెస్ హయంలో తెచ్చిన చట్టాలతోనే మీకు ఉద్యోగాలు వచ్చాయి.

మంత్రి సీతక్క

అమర వీరుల కుటుంబాలను ఆదుకుంటాం



1981లో జల్, జంగల్, జమీన్ కోసం అమరులైన కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుంది. ఈ యేడు సీఎం నాగోబా జాతరను పర్యటించిన సందర్భంగా అమరవీరుల స్తూపం వద్ద వారి స్మారకార్థం రూ.95లక్షలతో స్మృతి చిహ్నం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. దీంతో పాటు అమరుల కుటుంబాలకు ఉచిత ఇంటి స్థలంతో పాటు రూ.5 లక్షల వ్యయంతో ఇంటినిర్మాణం చేస్తాం. ఎన్నికల కోడ్ కారణంగా పనులు ప్రారంభించలేదు. ఎన్నికలు కాగానే పనులు ప్రారంభిస్తాం.

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంటింటికీ బీజేపీ ప్రచారం

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో శనివారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడం నగేష్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు నాగుల రాజ్‌కుమార్, బూత్ అధ్యక్షులు తోడిశెట్టి నితీష్, అఖిల్, సుమంత్, మల్లేష్, హరీష్, నిశాంత్, ప్రశాంత్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ప్రచారం

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ మండలం ముజ్గి, సోన్ మండలం కడ్తాల్ గ్రామాల్లో కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ శనివారం ప్రచారం నిర్వహించారు. చేతు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కేంద్రంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని, అలాగే రాష్ట్రంలో అధిక సీట్లు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి, నిర్మల్ మండల అధ్యక్షులు ఎంబరి గంగాధర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమర వీరులకు ఆదివాసుల సాంప్రదాయ పూజలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



అమరవీరులకు సాంప్రదాయ పూజలు చేస్తున్న ఆదివాసులు, నాయకులు

1981 ఏప్రిల్ 20న జరిగిన సంఘటనకు ఎట్టకేలకు స్వేచ్ఛ వాతావరణంలో ఆదివాసులు శనివారం ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి శిశుసంక్షేమ, పంచాయత్ రాజ్ శాఖ మంత్రి సీతక్క, కాంగ్రెసు ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో పాటు మాజీ ఎంపీ సోయం బాపురావు, బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కులు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావ్‌లు వేర్వేరుగా వచ్చి శ్రద్ధాంజలి ఘటించారు. అమర వీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు.

సాంప్రదాయ బద్ధంగా పూజలు..

వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఆదివాసులు ఇంద్రవెల్లిలోని ఇంద్రాదేవికి పూజలు చేశారు. అక్కడి నుంచి డోలు వాయిద్యాల మధ్య అమరవీరుల స్థూపానికి చేరుకున్నారు. స్థూపం ఆవరణలో జెండాకు తెల్లని వస్త్రముతో చేసిన జెండాకు ఎరుపు రంగును పూసి జెండాను ఆవిష్కరించారు. అక్కడ గ్రామ దేవారిలు, సార్మేడిలు ధాన్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజకు మాజీ ఎంపీ సోయం బాపురావు, ఆదివాసీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్దకు వెళ్లి దీపాన్ని వెలిగించి పూలను చల్లుతూ ఘన నివాళులు అర్పించారు. ఇంద్రవెల్లి అమరవీరులకు జోహార్లు పలికారు. ఈ సందర్భంగా పోలీసులు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా గట్టి బందోబస్తును నిర్వహించారు.

కేజీబీవీ విద్యార్థులకు పరామర్శ

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలోని నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థులను శనివారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లను విజ్ఞప్తి చేశారు. అస్వస్థకు గురైన విద్యార్థుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నర్సాపూర్(జి) మండల అధ్యక్షులు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు ఉమామహేశ్వర్, అజీమ్, మురళి, మనోజ్ యాదవ్, గాజుల రవి కుమార్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సురేందర్‌ను శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు అల్లూరి మల్లారెడ్డి పరామర్శించి, యోగ క్షేమాన్ని తెలుసుకున్నారు. ఆయన వెంట సతీష్, వంశీ ఉన్నారు.

మెగా వైద్యశిబిరం

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శనివారం హైదరాబాద్‌కి చెందిన ప్రముఖ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఒమేగా, హోలిస్టిక్ హాస్పిటల్ చెందిన ప్రముఖ వైద్య నిపుణులచే మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్, డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావులు ప్రారంభించారు. ప్రముఖ వైద్యులు గైనకాలజీ, ఆంకాలోజి, కార్డియాలజీ, యూరాలజీ, న్యూరాలజీ, ఆర్థోపెడిక్ సంబంధించినటువంటి డాక్టర్లతో డయాబెటిస్, ఎండక్రైనాలజీకి చెందిన సేవలు అందించారు. అనంతరం డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్, విశ్రాంతి ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షులు లింగన్న, ప్రాథమికంగా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు సాద సుదర్శన్, హన్మంత్‌రెడ్డి, గోపి, విశ్రాంత ఉద్యోగులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రూ.1.15లక్షల నగదు పట్టివేత

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని చించోలి(బి) ఎక్స్ రోడ్డు వద్ద శనివారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నిర్మల్ నుంచి కౌట్ల(బి) వైపు వెళుతున్న పెందన లక్ష్మణ్ వాహనంలో రూ.1.15లక్షల ఎలాంటి ధృవ పత్రాలు లేకుండా తీసుకెళుతున్న నగదును పట్టుకున్న ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. పట్టుకున్న నగదును నిర్మల్ కలెక్టరేట్ గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్టు ఎస్సై తెలిపారు. ఈ తనిఖీల్లో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు కూల్ క్యాన్‌ల పంపిణీ

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ ఆర్టీసీ డిపోలో ఎండ తాకిడికి ఉపశమనం పొందడానికి శనివారం డ్రైవర్లకు ఐదు లీటర్ల క్యాన్‌లు గోనె సంచితో కూడిన క్యాన్‌లను ఆదిలాబాద్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ శనివారం అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. డ్రైవర్లు విధులకు వెళ్లేటప్పుడు డిపోలోని ఆర్ఓ వాటర్ ప్లాంట్ నుంచి ఈ కూల్ క్యాన్ నింపుని విధులకు వెళ్లాలని సూచించారు. అలాగే ఎండలో విధులు నిర్వహిస్తున్నందున, తలకు, చెవులకు వడ దెబ్బ తగులకుండా తెల్లటి రూమల్ చుట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రతిమరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఇటీవల వెలువడిన సివిల్స్ ఫలితాల్లో 790వ ర్యాంకు సాధించిన రేకుల్‌వార్ శుభం ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి శనివారం ముత్నూర్‌లోని ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో విలాస్‌రెడ్డి, శివ జైస్వాల్, నాగేందర్ గౌడ్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి... పాలిటెక్నిక్ ఉత్తమ మార్గం..

- సంజయ్ గాంధీ కళాశాల ఆదిలాబాద్, ప్రిన్సిపాల్ అండ్ పాలిసెట్-2024 జిల్లా సమన్వయకర్త పి.భరద్వాజ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పాలిటెక్నిక్ బాటలు వేస్తోంది. నైపుణ్యం ఉంటే చాలు స్వయం ఉపాధితో పాటు ఉద్యోగాలు పొందేందుకు సరైన అవకాశాలను కల్పిస్తోంది. కొలువులో తొందరగా స్థిరపడాలన్నా, ఇంజనీర్‌గా ఎదగాలన్నా పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు ప్రత్యామ్నాయం. డిప్లొమా విద్యార్థులకు నైపుణ్యాలు మెరుగ్గా ఉంటుండటంతో అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయి. దీంతో డిప్లొమా కోర్సులకు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నది. సాంకేతిక కళాశాల విద్యను రాష్ట్రంలో ప్రత్యేకంగా కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ పర్యవేక్షిస్తుండటంతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందుతున్నాయి.

ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా సిలబస్‌ను మారుస్తూ విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందిస్తున్నారు. పాలిటెక్నిక్‌లో చదివే సబ్జెక్టులే ఇంజనీరింగ్‌లో కూడా ఉంటాయి. పాలిటెక్నిక్ తర్వాత ఇంజనీరింగ్ చేస్తే చాలా సులువుగా సబ్జెక్ట్‌పై పట్టు వస్తుంది. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల కంటే కూడా పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన వారికి కంపెనీలు అధిక ప్రాధ్యానం ఇస్తున్నాయి. పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సు పూర్తయ్యాక ఈసెట్ రాసి, నేరుగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో చేరొచ్చు. తక్కువ ఖర్చుతో ఇంజనీరింగ్ వైపు అడుగులు వేసేందుకు వీలుకల్పించే అద్భుత అవకాశం పాలిటెక్నిక్. డిప్లొమా పూర్తి చేసిన వారు స్వయం ఉపాధి ద్వారా కూడా స్థిరపడొచ్చు. ఇందుకు ఆర్థిక సంస్థల సహకారం పొందవచ్చు.

నూతన విద్యావిధానం ప్రకారంగా పాలిటెక్నిక్ కోర్సులో ఫెయిలయ్యి నిర్ణయించిన క్రెడిట్‌లు సాధించినా ఆయా విద్యార్థికి 10ప్లస్2 సర్టిఫికెట్ ఇన్ ఇంజినీరింగ్‌ను జారీ చేసే అవకాశం ఉన్నది. పాలిటెక్నిక్ కళాశాలలలో విద్యార్థుల సంరక్షణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా అధ్యాపకులు, విద్యార్థుల హాజరు నమోదుకు బయోమెట్రిక్ విధానాన్ని అవలంబిస్తున్నారు. ఆఫీసు, పరీక్షల నిర్వహణలో ఆన్‌లైన్ సాంకేతిక సహకారాన్ని తీసుకుంటున్నారు. విద్యార్థుల విశ్లేషణ, సృజనాత్మకత పెంచడానికి కొన్ని సబ్జెక్టులలో ప్రామాణిక పుస్తకాలతో ఓపెన్ బుక్ పరీక్ష విధానాన్ని అమలు చేస్తున్నారు.

ఆదిలాబాద్ పాలిటెక్నిక్ కళాశాల ప్రస్థానం..

ఆదిలాబాద్‌లోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 1980 లో ప్రారంభమైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో స్థాపించబడిన మొట్ట మొదటి పాలిటెక్నిక్ కళాశాల ఇదే కావడం విశేషం. సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కోర్సులలో 60 సీట్లు చొప్పున మొత్తం 240 సీట్లు ఉన్నాయి. జిల్లాలోని ప్రభుత్వ ఆదర్శ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ బాలుర కళాశాల, ఉట్నూర్‌లో మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాలలో 60 సీట్లు చొప్పున మొత్తం 120 ఉన్నాయి. పాలిటెక్నిక్ ప్రవేశాలు పాలిసెట్ ప్రవేశ పరీక్షల్లో వచ్చిన ర్యాంకు ఆధారంగా జరుగుతాయి.

ఉట్నూర్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల...

ఆదిలాబాద్ జిల్లాలో రెండు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు అందుబాటులో ఉన్నాయి. అందులో జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ఒకటి మరొకటి జిల్లాలోని ఉట్నూర్ మండలంలోని లాల్ టెక్డిలో ఉన్న ప్రభుత్వ కళాశాల ఒకటి ఈ కళాశాల 2014లో స్థాపించబడింది. ప్రస్తుతం పదో వసంతం కొనసాగుతోంది. ఈ కళాశాలలో మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచీలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతి సౌకర్యం కూడా కలదు. ఏజెన్సీ విద్యార్థులకు గిరిజనులకు ఈ విద్యావకాశం ఎంతగానో దోహదపడుతుంది. ఈ సదవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మీ సూచించారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్ష సిలబస్, ర్యాంకుల జారీ..

గణితం, భౌతిక, రసాయన, జీవశాస్త్రాలలో పదో తరగతి స్థాయిలో మల్టిపుల్ ఆప్షన్ ప్రశ్నలతో రెండున్నర గంటల ప్రవేశ పరీక్ష తెలుగు, ఆంగ్లం మాధ్యమంలో ఉంటుంది. గణితంలో 60 మార్కులకు 60 ప్రశ్నలు, భౌతిక శాస్త్రంలో 30 మార్కులకు 30 ప్రశ్నలు, రసాయన శాస్త్రంలో30 మార్కులకు 30 ప్రశ్నలు, జీవశాస్త్రంలోనూ 30 మార్కులకు 30 ప్రశ్నలు ఉంటాయి. మొత్తం ప్రశ్నలు 150, మొత్తం మార్కులు 150, పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులకు ఒకటి ఎంపీసీ ర్యాంక్, మరొకటి ఎంబీఐపీసీ ర్యాంకులు ఇవ్వబడతాయి. వ్యవసాయ, వెటర్నరి, హార్టికల్చర్, అనిమల్ హస్బెండ్రి, ఫిషరిష్ డిప్లమా కోర్సులలో ప్రవేశాలు కూడా పాలిసెట్-2024 ర్యాంక్ ఆధారంగానే జరుగుతాయి. ఈ కోర్సులు చేయదలచుకున్న విద్యార్థులు తప్పనిసరిగా జీవశాస్త్రానికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది.

పాలిసెట్ నోటిఫికేషన్ వివరాలు...

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాలిటెక్నిక్ కళాశాలలలో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ కోర్సులలో 2024 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష పాలిసెట్-2024 ప్రకటనను రాష్ట్ర సాంకేతిక విద్య శిక్షణ బోర్డు సెక్రెటరీ విడుదల చేశారు. పదోతరగతి పూర్తయిన, చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. రెండేండ్ల ఐటీఐ కోర్స్ ఉత్తీర్ణతతో పాటు డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ (డీఈటి) అందించే బ్రిడ్జి కోర్స్ పూర్తి చేసిన వారు లేటరల్ ఎంట్రీ ఇంటు పాలిటెక్నిక్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎల్పీసెట్ 2024) నోటిఫికేషన్ ద్వారా డిప్లమా ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చు.



పాలిసెట్ ఆన్‌లైన్ అప్లికేషన్ ఈనెల 22వ తేదీ వరకు ముగుస్తుంది. ఆలస్య రుసుము రూ.100తో ఏప్రిల్ 24 వ తేదీ వరకు అవకాశం ఉంది. అలాగే రూ.300తో ఆలస్య రుసుముతో ఏప్రిల్ 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి వెసులుబాటు కల్పించారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష మే 24వ తేదీన జరగనుంది. పాలీసెట్-2024కు సంబంధించిన పూర్తి వివరాలు, సమాచార పుస్తకాన్ని పాలీసెట్.ఎస్‌బీటీఈటీ.తెలంగాణ.గావ్.ఇన్ వెబ్‌సైట్‌లో సందర్శించి చూడవచ్చు.

ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

త్వరితగతిన ఉపాధికి, అతి తక్కువ ఖర్చుతో ఉన్నత విద్య ఉద్యోగ అవకాశాలకు, స్వయం ఉపాధి చేపట్టడానికి పాలిటెక్నిక్ విద్య ఉత్తమమార్గం. ఇంటర్ మీడియట్ ద్వారా ఇంజనీరింగ్ చేసిన విద్యార్థులకంటే పాలిటెక్నిక్ ద్వారా ఇంజనీరింగ్ చేసిన విద్యార్థులలో థియరీ, ప్రాక్టికల్స్ పరిజ్ఞానం, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు ఎక్కువగా ఉండటం వల్ల ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటున్నాయి. అంతేకాకుండా డిప్లమా చివరి సంవత్సరంలో 6 నెలల పారిశ్రామిక శిక్షణ ద్వారా విద్యార్థుల సాంకేతిక నైపుణ్యం మరింత మెరుగుపడుతుంది. ఆదిలాబాద్‌లోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు అఖిలభారత సాంకేతిక విద్యా మండలి గుర్తింపు తో పాటు మెకానికల్ ఇంజనీరింగ్ కోర్స్‌కి నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) మూడు సంవత్సరాల గుర్తింపు కలదు. మా కళాశాలలో చదువుకున్న విద్యార్థులు ఇప్పటికే ప్రభుత్వ ప్రయివేటు రంగాల్లో స్థిరపడ్డారు. కళాశాలలోని నాలుగు కోర్సులకు పాలీసెట్ ప్రవేశ పరీక్ష ర్యాంక్ ఆధారంగా ప్రవేశాలు జరుగుతాయి. విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలి. గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి.



సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అండ్ పాలిసెట్-2024 జిల్లా సమన్వయకర్త పి.భరద్వాజ

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | ఏప్రిల్ 21, 2024 | www.navatelangana.com

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద వారసంతను పురస్కరించుకొని ఆసిఫాబాద్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉబేద్ బిన్ యహీయా (తారిక్) ఆధ్వర్యంలో అంబలి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరంతరం సేవలు కొనసాగుతాయని తెలిపారు. ఎండ కాలంలో ప్రజలకు ఎండను ఉపశనం పొందేలా అంబలి పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పుల్లూరి శంకర్, డైరెక్టర్ వెంకట రమణ రెడ్డి, నాంపల్లి శంకర్, రావుల వినాయకరావు, సభ్యులు కాంద్రే విశాల్ పాల్గొన్నారు.

అక్రమంగా ఏర్పాటు చేసిన కంచె తొలగింపు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎందుట అక్రమంగా ఏర్పాటు చేసిన కంచెను తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ గంగాసింగ్ ఆధ్వర్యంలో తొలగించారు. అక్రమంగా కంచె వేశారన్న ఫిర్యాదు మేరకు శనివారం తొలగించారు. ప్రభుత్వ భూముల్లో ఎవరైన కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి అక్రమాణలుంటే అధికారులకు తెలియజేయాలని కోరారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా దేవ భూషణం ఎన్నిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన దేవ భూషణం ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో శనివారం ఎన్నికలు జరిగాయి. దీనికి పరిశీలకులుగా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రావు, సీనియర్ ట్రస్మ నాయకులు ఆదినాథ్, దేవేందర్ పటార్కర్, జిల్లా సీనియర్ నాయకుడు పెద్దపల్లి కిషన్ రావుల వ్యవహరించారు. జిల్లాలో 81 ప్రయివేట్ పాఠశాలలు ఉండగా 72 పాఠశాలల యాజమాన్యాలు పాల్గొన్నాయన్నారు. అధ్యక్షులుగా దేవభూషణం, తాజుద్దీన్‌లు పోటీ పడగా దేవ భూషణం 46 ఓట్లు పొంది 20 ఓట్ల తేడాతో గెలుపొందినట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా పి.తిరుపతి, కోశాధికారిగా బుద్ధ రాజేంద్రప్రసాద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రావు మాట్లాడుతూ జిల్లాలో ప్రయివేట్ పాఠశాల సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీ పని చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేట్ పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. విద్యావ్యవస్థలో ప్రయివేట్ పాఠశాలల పాత్ర ఎంతో ఉందన్నారు. దీన్ని గుర్తించి అవసరమైన సహాయం చేయాలని అన్నారు.

ఓటర్లకు భరోసా కల్పిస్తూ పోలీసుల కవాతు



నవతెలంగాణ-కౌటాల

ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు భరోసా కల్పిస్తూ పోలీసులు కవాతు నిర్వహించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు నిర్భయంగా ఓటును వినియోగించుకోవాలని ఎస్ఐ మధూకర్ అన్నారు. శనివారం మండలంలోని మొగడ్‌దగడ్, వీర్దండి, గుండాయిపేట్, తుమ్మిహేటి గ్రామాల్లో సీఆర్‌పీఎస్ బృందాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు లేని వారు, 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. శాంతియుత వాతావరణంలో ఓటును వినియోగించుకొనేందుకు పోలీసుల ఆధ్వర్యంలో భద్రత చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. ప్రజల్లో భయం పోగొట్టాలనే ఉద్దేశ్యంతో గ్రామాల్లో కవాతు నిర్వాహించామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎవరైన డబ్బులు పంచడం, సంఘ సమావేశాలు నిర్వహించి ప్రలోభాలకు గురిచేసినట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందిన 10 నిమిషాల్లో సంఘటన స్థలానికి చేరుకొని చర్యలు తీసుకుంటామన్నారు. అల్లర్లు సృష్టించిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

హనుమాన్ ఆలయంలో ఎంపీ అభ్యర్థి పూజలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా బి-ఫామ్ తీసుకున్న తర్వాత జిల్లా కేంద్రానికి వచ్చిన ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు స్థానిక కేస్లాపూర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శిరీష్ శర్మ, అర్చకుడు శ్రీనివాసరావు ఎంపీ అభ్యర్థికి ఆశీర్వాదం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకుడు జాలింషా, సక్కు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జయంతి ఉత్సవాలకు ఆహ్వానం

ఆలయంలో ఈ నెల 23న నిర్వహించే జయంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను కమిటీ సభ్యులతో కలిసి బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. చరిత్ర కలిగిన ఆలయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పిన్న వివేక్, గుండా వెంకన్న, రాధాకృష్ణ చారి, ఎకరాల శ్రీనివాస్, డాక్టర్ మధు, సురేందర్ పాల్గొన్నారు.

27న మండలానికి మంత్రి సీతక్క రాక



నవతెలంగాణ-బెజ్జూర్

ఈనెల 27న మండలానికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క వస్తున్నట్లు సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండలంలోని ముంజంపల్లి, కుకూడా, పాపన్‌పేట గ్రామాల్లో పర్యటించినంతరం మండల కేంద్రంలో ఏర్పాటు విలేకరుల సమావేశం మాట్లాడారు. రాష్ట్ర మంత్రి సీతక్క పర్యటన విజయవంతం చేయాలని కోరారు. సీతక్కతో పాటు ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్క, హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాచకొండ శ్రీవర్ధన్, మండల అధ్యక్షులు బూస శంకర్, పీఏసీఎస్ చైర్మెన్ ఓం ప్రకాష్, మండల కో ఆప్షన్ సభ్యులు బషరత్ ఖాన్, నాయకులు కొండ్ర జగ్గాగౌడ్, నసీర్ అలీ, రామకృష్ణ, జావిద్ అలీ, వెంకన్న, నరేందర్ గౌడ్, తంగడపెల్లి మహేష్, శ్రీనివాస్, హకీం, పుల్లూరి సతీష్, ఎంపీటీసీలు గురజాల వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

● కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహణను అధికారులు సమన్వయంతో పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమీషనర్లతో కలిసి జిల్లాలో పారిశుధ్య నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో ప్రతిరోజు పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళలలో చెత్త సేకరణపై మైకుల ద్వారా తెలియజేస్తూ ప్రతి ఇంటి నుండి తడిపొడి చెత్తలను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య సిబ్బంది విధులకు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. తడిపొడి చెత్తను వేరువేరుగా సేకరించేందుకు ట్రాక్టర్లు, ఆటోలను కార్యాచరణ ప్రకారంగా వినియోగించాలని, ఈ క్రమంలో అవసరమైన నిధుల ప్రతిపాదనలను రూపొందించాలన్నారు. మున్సిపాలిటీల పరిధిలో వార్డు అధికారులు పారిశుధ్య సిబ్బంది సమన్వయంతో చెత్త సేకరణ చేయాలని, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాపార సముదాయ ప్రాంతాలు, ముఖ్యమైన కూడళ్ళు, ప్రధాన రహదారులు, ట్రాఫిక్ ప్రాంతాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సేకరించిన చెత్తలో ఉపయోగపడే వాటిని వేరుచేసి కంపోస్ట్ షెడ్‌కు తరలించాలని, ఎరువులు, ఫాంపాండ్ ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు సైతం తాగునీరు అందే విధంగా సమన్వయంతో పనిచేయాలని, నీటి సరఫరాకు అవకాశం లేని ప్రాంతాలలో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని అందించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెరువు కుంటల పూడికతీత వెంటనే చేయాలి

జిల్లాలోని చెరువులు, కుంటలు, కాలువల పూడికతీత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని చెరువులు, కుంటలు, కాలువల పూడికతీత పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల నిర్మాణం, నీటిపారుదల ప్రాజెక్టులలో నీటిమట్టం, పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని రైతులు సాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సాగునీటి లభ్యతపై వ్యవసాయ శాఖ అధికారులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో సాగునీరు, విద్యుత్ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నందున నీటిపారుదల శాఖ అధికారులు తమ శాఖ పరిధిలోని అభివృద్ధి పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలని, నూతన కాలువల నిర్మాణం, ఉన్న కాలువలలో పూడికతీత, పిచ్చి మొక్కల తొలగింపు, లైనింగ్ పనులను చేపట్టాలని తెలిపారు. మే నెల మొత్తం తాగు నీటిపారుదలకు సంబంధించిన పనులను నిర్వహించాలని, ఇందు కోసం సహాయ ప్రాజెక్టు అధికారులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఈఈలు గుణవంతరావు, ప్రభాకర్, డిఈఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ పార్లమెంటు కన్వీనర్ లతీఫ్

నవతెలంగాణ-సిర్పూర్(టి)

కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్యం అనంతరం అధికారం చేపట్టి నాటి నుండి నేటి వరకు పేదల సంక్షేమం కోసం నిరంతరం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఉన్నత వర్గాలతో సమానంగా పథకాలను ప్రవేశపెట్టి అభివృద్ధి చేయాలనే తపనతో ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అని ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఎంఏ లతీఫ్ అన్నారు. శనివారం రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ షెకిల్ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ పార్లమెంటు అభ్యర్థిగా ఆత్రం సుగుణక్కను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంటుకు పంపించాలన్నారు. దేశంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చే బాధ్యత మనపై ఉందన్నారు. పార్టీ పేదల అభివృద్ధి కోసం పాటుపడడానికి దీనిలో భాగంగానే గతంలో మన భావిభారత ప్రధానీ రాహుల్‌గాంధీ జోడో యాత్రలో భాగంగా కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు, రెండో దశలో మణిపూర్ నుండి ఢిల్లీ వరకు యాత్ర కొనసాగిందన్నారు. పేద ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని భవిష్యత్తులో నెరవేర్చడమే యాత్ర ముఖ్య ఉద్దేశ్యమన్నారు. బీజేపీ అధికారం చేపట్టిన నుండి ఇప్పటివరకు అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు వ్యక్తులకు, కేవలం ఉన్నత వర్గాలకు మాత్రమే కట్టబెట్టిందని, దీంతో సామాన్య ప్రజలకు ఇబ్బందికరంగా ఉందన్నారు. అనంతరం రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ షెకిల్ మాట్లాడుతూ నా రాజకీయ జీవితంలో కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల కోసం చేసినంత మేలు ఏ పార్టీ చేయలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ పార్లమెంటు అభ్యర్థిని గెలిపించాలని, దీనిలో భాగంగా నియోజకవర్గంలో పల్లెపల్లె, గడపగడపకు వెళ్లి ప్రచారం నిర్వహిస్తామన్నారు. వీరి వెంట రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ మోయినొద్దీన్, జిల్లా వికలాంగుల అధ్యక్షుడు ఇప్ప రవిశంకర్, నాయకులు అఖిల్, సలీమ్, ఇఫ్తేహుస్సేన్ పాల్గొన్నారు.

ఫిర్యాదారులకు నాణ్యమైన సేవలందించాలి

● ఎస్పీ సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. శనివారం ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌ని తనిఖీ చేశారు. స్టేషన్‌లో ఫిర్యాదారులకు అందిస్తున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫైళ్లు, రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపుర్వకంగా ఉంటూ వారి సమస్యలను ఓపికతో విని వాటిని పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు మంచి సేవలు అందించేందుకు ప్రతి పోలీస్ అధికారి కృషి చేయాలన్నారు. అదే విధంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సిబ్బంది పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రతి గ్రామం గురించి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలతో మమేకమై, ప్రజలకు మరింత చేరువ కావాలని తెలిపారు. ఉత్తమ పని తీరు కనబరిచిన వారికి ప్రతిఫలం దక్కుతుందన్నారు. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ బాధితులకు సైబర్ వారియర్స్ ద్వారా వీలైనంత త్వరగా న్యాయం జరిగేలా చూడాలన్నారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది విధి విధానాల గురించి సూచించే 5-ఎస్ విధానంను పోలీస్ స్టేషన్‌లో అమలు చేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలపాలను నిరోధించడంతో పాటు చట్టాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సతీష్, ఎస్ఐ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ సురేష్ కుమార్

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్

నవతెలంగాణ-కెరమెరి

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, అనార్‌పల్లి మాజీ సర్పంచ్ రాథోడ్ శేషారావు శనివారం మంత్రి సీతక్క, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి సీతక్క ఆయనను పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతు నిత్యం ప్రజాసేవలో ఉంటే తప్పకుండా ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు.పార్టీలో చేరిన వారిలో కో ఆప్షన్ మెంబర్ దస్తగిరి, తెలంగాణ జేఏసీ మాజీ చైర్మన్ ఉత్తం రాథోడ్, అన్నా భావు సాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, దళిత రత్న అవార్డు గ్రహీత నర్సింగ్ మోరే, సహకార సంఘం డైరెక్టర్ కాంతారావ్, మాజీ ఉప సర్పంచ్ దాదే అలీ, బీఆర్ఎస్వీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోర్రల మహేందర్, మహమ్మద్ ఖురేషి, షేక్ హుస్సేన్, మన్సూర్ ఖాన్, మాజీ వార్డ్ మెంబర్ శాంతారావ్, రాథోడ్ అశోక్, గోవింద్ ఉన్నారు.



బీజేపీ ప్రచార కరపత్రాలు విడుదల

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలకేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు జునుగరి మధూకర్ ఆధ్వర్యంలో శనివారం బీజేపీ జిల్లా కోశాధికారి అరుణ్‌లోయా బూత్‌స్థాయి బీజేపీ కార్యకర్తలతో కలిసి ఎన్నికల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బూత్ అధ్యక్షులు గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అమలు చేస్తున్న పథకాలను గడపగడపకు తీసుకెళ్లి వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శక్తికేంద్రం ఇన్‌చార్జిలు గణపురం నాగేష్, కుకుడె రాజేష్, రౌతు భూజంగరావు, కడంబ శ్రీనివాస్, పాగిడి ఖాంతారావు, పంద్రం గణపతి, బూత్ అధ్యక్షులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గడపగడపకు బీజేపీ ప్రచారం

మండలంలోని కమ్మర్‌గాం గ్రామంలో శక్తికేంద్రం ఇన్‌చార్జి కుకుడ రాజేష్ ఆధ్వర్యంలో శనివారం పార్టీ ఎంపీ అభ్యర్థి గొడం నగేష్‌ను కమలం పువ్వుకు ఓటు వేసి గెలిపించాలని కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నాజీ, ఆనంద్‌రావు, మధునయ్య, అనంత్‌రావు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లో సౌకర్యాలు కల్పించాలి

● జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్



నవతెలంగాణ-దహెగాం

పోలింగ్ బూతులో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని కుమురం భీం జిల్లా జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మూడు పోలింగ్ కేంద్రాలతో పాటు పెసరుగుంట గ్రామంలో గల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. వికలాంగ ఓటర్ల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంను సైతం పరిశీలించారు. మెనూ వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి మంచి రుచికరమైన భోజనంతో పాటు నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్ బాబు పాల్గొన్నారు.

గురుకుల ఫలితాల్లో చింతగూడ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

తెలంగాణ గురుకుల సొసైటీ శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో చింతగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారికి పాఠశాల ఆవరణలో ప్రత్యేక శిక్షణ తరగతులు ఇవ్వడం జరిగిందన్నారు. పాఠశాల నుండి ఏముర్ల సుహాని, పెబ్బర ధరణి, అజిత్ రహానే, నీలం ఆర్యన్ ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. తమ పాఠశాలలో కోచింగ్ తీసుకున్న ప్రాథమిక పాఠశాల బలగల గ్రామానికి చెందిన జి లక్ష్మి, కోయవాగు గ్రామానికి చెందిన రాంటెంకి గ్రీష్మ సైతం గురుకుల పాఠశాలలో ఎంపికైనట్టు తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు సహకరించిన ఉపాధ్యాయులు తలండి లక్ష్మణ్, పుల్లూరి బాలకృష్ణ, ప్రియాంకలను ఆయన అభినందించారు.

విద్యార్థులను అభినందించిన హెచ్ఎం

కౌటాల : గురుకులంలో సీట్లు సాధించిన ఇద్దరు విద్యార్థులను మండలంలోని తలోడి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఎల్ లూర్దు రాజు అభినందించారు. ఇటీవల గురుకుల అర్హత పరీక్ష రాసి సీటు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. ఉన్నత చదవుల్లో విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సురేష్, తల్లిదండ్రులున్నారు.

డీఎస్సీ గ్రూప్స్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో డీఎస్సీ గ్రూప్స్ రాయనున్న దివ్యాంగులకు ఉచిత కోచింగ్ అందించనున్నట్లు వికలాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనాథలైన, పేదలైనవారికి వికలాంగులకు తమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని దుర్గాభాయి దేశముఖ్ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థలో ఉచిత కోచింగ్‌తో పాటు వసతి కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 25లోపు జిల్లా కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని, ఇతర వివరాల కోసం 9491460658 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కమాన గ్రామానికి చెందిన గుర్రం శ్రీకాంత్ పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందినట్టు ఎస్ఐ సాగర్ తెలిపారు. శనివారం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాంత్‌కు ఏడాదిన్నర క్రితం మంచిర్యాల జిల్లా టేకుమట్లకు చెందిన నిహారికతో ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. శ్రీకాంత్ బైక్ మెకానిక్ గ్యారేజ్ పెట్టుకున్నాడు. గ్యారేజ్‌లో ఆర్థికంగా నష్టపోవడంతో మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 13న వాంకిడి టోల్‌ప్లాజా సమీపంలో మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు శ్రీకాంత్‌ను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుని తల్లి గుర్రం అర్చన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సాగర్ తెలిపారు.

నేడు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం ఉదయం 10:30 గంటలకు సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు అధ్యక్ష కార్యదర్శులు ఎం. జయదేవ అబ్రహం, ఎం. శివప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో సంఘం తీసుకున్న కార్యక్రమాలు, అభివృద్ధికి, సంఘ ఆర్థిక లావాదేవీలు ఇతర అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సంఘ సభ్యులు సకాలంలో హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

25న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ మండల పరిషత్ సరసభ్య సమావేశం ఈ నెల 25న ఉదయం 11.30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బి. రమేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలకవర్గ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

గురుకులంలో 14 మంది విద్యార్థులకు చోటు

నవతెలంగాణ-జన్నారం



ఇటీవల విడుదలైన గురుకుల పాఠశాల, సీట్ల భర్తీ కోసం, నిర్వహించిన పరీక్ష ఫలితాలలో జన్నారం మండలంలోని కలమడుగు వివేకానంద ప్రయివేటు పాఠశాల నుంచి 19 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 14 మంది ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ అమరగొండ సతీష్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులు, వివేకానంద పాఠశాల ఉపాధ్యాయులను, ప్రిన్సిపాల్‌ను అభినందించారు.

సందడిగా చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే

నవతెలంగాణ-నస్పూర్



సృష్టి ప్లే స్కూల్‌లో శనివారం సందడిగా చిన్నారుల గ్రాడ్యుయేషన్ డేని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు గ్రాడ్యుయేషన్ దుస్తులలో కోలాహలం చేశారు. అనంతరం ఆటపాటలతో చిన్నారులు అలరించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ అంబాల రాజ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే చిన్నప్పటి నుండి క్రమశిక్షణ కలిగి ఉండాలని అన్నారు. ఇలాంటి గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం వల్ల పిల్లలు ప్రోత్సాహం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయురాలు రజిత, రమాదేవి, రవళి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్మికులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

కార్మికులపై డీజీఎం పర్సనల్ అరవిందరావు, ఎస్టేట్ అధికారులు చేస్తున్న కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సింగరేణి కార్మికుడు పేరం రమేష్ అన్నారు. శనివారం అధికారుల నిర్లక్ష్య వైఖరి, కక్ష సాధింపు చర్యలకు వ్యతిరేకంగా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమాన్ని చూసే పర్సనల్ డిపార్ట్మెంట్ డీజీఎం అరవిందరావు, ఎస్టేట్ అధికారుల నిర్లక్ష్య వైఖరి, కక్ష సాధింపు చర్యలు చేస్తూ, వ్యక్తిగత కక్షలతోని సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తూ ప్రమోషన్లు రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. మాట్లాడితే చార్జి షీట్, బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. 2019లో వెంకటేశ్వర స్వామి ఆలయం విషయంలో ఛార్జ్ షీట్ ఇవ్వడం జరిగిందని, ఛార్జ్ షీట్‌కు సమాధానం కూడా ఇచ్చామన్నారు. 2021 సంవత్సరంలో తనకు రావలసిన ప్రమోషన్‌కు ఛార్జ్ షీట్ అడ్డు చూపుతూ, నేను ఎన్నిసార్లు అడిగినా డీజీఎం పర్సనల్ అరవిందరావు దాటవేస్తు, మాచేతుల్లో లేదని కొత్తగూడెం హెడ్ ఆఫీస్‌కు పంపడం జరిగిందని తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కానీ హెడ్ ఆఫీస్ వారిని సంప్రదించగా ఏరియా జీఎం పరిధిలోనే ఉంటుందని వారు పేర్కొన్నట్లు తెలిపారు. ఎస్టేట్ డిపార్ట్ పేరుతో, ఐకె ఓసీపీ పేరుతో 4 సంవత్సరాలుగా కాలయాపన చేస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం జరుగుతుందని, డీజీఎం పర్సనల్ కార్మికులు వారి సమస్యల నిమిత్తం అధికారుల కార్యాలయాలకు వెళ్తే చులకనగా మాట్లాడడం, హేళన చేయడం నేను పని చేయను ఎక్కడ చెప్పుకుంటావో చెప్పుకోమ్మని బెదిరించడం, అహంకారంతో మాట్లాడుతున్నారని అన్నారు. కార్మికులకు రావలసిన ప్రమోషన్లను నెలల తరబడి ఇవ్వకుండా జాప్యం చేయడం, ఆఫీస్ ఆర్డర్లు లేట్ చేయడం, విజిలెన్స్ పేర్లతో బెదిరించడం, ఎదురు మాట్లాడిన వారిని మనసులో పెట్టుకొని వేధించడం లాంటి చేయడాన్ని పూర్తిగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

మే డేను విజయవంతం చేయండి



నవతెలంగాణ-మంచిర్యాల

కార్మిక చట్టాల పునరుద్ధరణకై బీజేపీని ఓడించి, దేశాన్ని, రాజ్యాంగాన్ని ప్రజలను రక్షించుకోవలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో 138వ మే డేను విజయవంతం చేయాలని కోరుతూ మే డే పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం మోసపూరిత కుట్రలు, కుతంత్రాల ప్రభుత్వం నడుస్తుందనీ ఒకప్పుడు నష్టం వచ్చే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తామన్నారు. కానీ తర్వాత కల్లబొల్లి కబుర్లతో లాభాలు వచ్చే సంస్థలను కూడా అమ్మకానికి పెట్టారని ఇప్పుడు ఏకంగా ప్రభుత్వం వ్యాపారం చేస్తుందని చెబుతూ ప్రభుత్వ రంగా పరిశ్రమలు, గనులు, రవాణా, టెలికాం, బ్యాంకు, ఇన్స్యూరెన్స్, కంపెనీలను ఆఖరికి దేశ రక్షణ కోసం పనిచేసే డిఫెన్స్ రక్షణ రంగాన్ని కూడా వదలటం లేదన్నారు. ల్యాబ్, ఇస్రో అలాంటి ప్రతిష్టాత్మకమైన పరిశోధనల సంస్థలను కూడా అంబానీ, ఆదానీ లాంటి పెట్టుబడిదారులకు అమ్మేశారన్నారు. సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు లేకుండా చేసే ఇట్లాంటి దుర్మార్గపు పాలనను ఓడించాలని రేపు జరగబోయేటువంటి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి ఓడించేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మేడే సందర్భంగా అన్ని వర్గాల ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఖలిందర్ అలీ ఖాన్, ఉపాధ్యక్షులు మిట్టపల్లి ఫౌల్, రాజమల్లు, మెడికల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు రాయమల్లు, మధు, రాకేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జన్నారం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలను శనివారం జన్నారం మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పులిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను రాజకీయంగా అభివృద్ధి చేసిందే తెలుగుదేశం పార్టీ, నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి, ఉప్పుల విజయ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గొల్లపల్లి ప్రసాద్, ముత్తంపల్లి నవీన్, కట్ట నాగరాజు, నర్సయ్య, బండారి రాయలింగు పాల్గొన్నారు.

తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్



వేసవికాలం పూర్తి అయ్యే వరకు జిల్లా వ్యాప్తంగా తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లాలోని హాజీపూర్ మండలంలో గల ఎల్లంపల్లి ప్రాజెక్టును అదనపు కలెక్టర్ బి.రాహుల్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ మధుసూదన్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టు సెగ్మెంట్ పరిధిలో వేసవికాలం పూర్తయ్యే వరకు నిరంతర తాగునీటి సరఫరాకు కార్యచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి అందుతున్న త్రాగునీటి సరఫరా ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని, సమస్యలు తలెత్తినట్లయితే త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. మిషన్ భగీరథ పథకం క్రింద జిల్లాలో జరుగుతున్న నీటి సరఫరాపై ప్రతి రోజు నివేదిక అందించాలని తెలిపారు. నీటి వనరులు అందుబాటులో లేని ప్రాంతాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా త్రాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. పైప్లైన్ల లీకేజీ సమస్యలు, బోర్వెల్ల మరమ్మత్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించి నీటి సరఫరాను పునఃరుద్ధరించేలా త్వరితగతిన పనులు చేపట్టాలని తెలిపారు. వేసవి ఉష్ణోగ్రత అధికం అవుతున్న నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వచ్చే 3 నెలలు ప్రతి ఇంటికి నీటిని అందించేలా కార్యచరణ రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



అక్షింతలు సరే.. దేశంలో అభివృద్ధి ఏది..?

- ఆరు గ్యారెంటీలు తప్పక అమలు చేస్తాం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- ఎంపీ అభ్యర్థి సుగుణ తరపున మండలంలో ప్రచారం



నవతెలంగాణ-జన్నారం

బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఇంటింటికి అక్షతలు పంచింది సరే, దేశం అభివృద్ధి మాటేంటని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. శనివారం మండలంలోని రాంపూర్, తిమ్మాపూర్, తపాలాపూర్ గ్రామాల్లో ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు మద్దతుగా, ఖానాపూర్ ఎమ్మెల్యే వేడమా బొజ్జు పటేల్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. రాముని పేరు చెప్పుకొని ఓట్లు అడగడం కాదు, అభివృద్ధి చేసి చూపించాలన్నారు. రాంపూర్ గ్రామంలో చెరువులో పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని తెచ్చిందే కాంగ్రెస్ అని వారన్నారు. కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తే ప్రతికూలికి రూ.400 ఇస్తామన్నారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయాలని చూస్తుందన్నారు. పని దినాలను తగ్గించి, కూలి డబ్బులను తగ్గించిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉంటే, అది ఇప్పుడు 600 కోట్లతో అప్పుల్లో కూరుకుపోయింది అన్నారు. వడ్డీలు కట్టడానికే ఇప్పటి ప్రభుత్వం తర్జనభజన పడుతుందన్నారు. అనంతరం తిమ్మాపూర్ గ్రామంలో పర్యటించి, హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తల్లి, కనక బుధవ్వను శాలువా పూలమాలతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తిమ్మాపూర్ ఆడబిడ్డ ఆత్రం సుగుణను, రేవంత్‌రెడ్డి, కార్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సోనియా గాంధీ, గుర్తించి ఎంపీ టికెట్ ఇచ్చిందన్నారు. ఈ గ్రామంలో ఒక్క ఓటు కూడా వేరే పార్టీకి పడకుండా గంపగుత్తగా కాంగ్రెస్ పార్టీకి వేయాలని గ్రామస్తులను కోరారు, రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలన్నారు. అనంతరం తపాలాపూర్ గ్రామంలో పర్యటించి ముందుగా శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం, కార్యకర్తలతో మాట్లాడారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడిఉంది అన్నారు. ఆగస్టులోగా రైతుల రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఉచిత విద్యుత్తు, 500 కే గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామన్నారు. మిగతా గ్యారంటీలను ఎన్నికల తర్వాత, అమలు చేస్తామన్నారు.



పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంత్రి సీతక్కతో కలిసి ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. ఇందిరమ్మ ఇంటిలో నివసిస్తున్న తనను, ఎమ్మెల్యేని చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. అలాంటి పేదింటి నుంచి వచ్చిన ఒక మహిళా టీచర్, ఆత్రం సుగుణ అన్నారు. అలాంటి మహిళను గెలిపిస్తే, పేదల పక్షాన పార్లమెంటులో పోరాటం చేస్తుందన్నారు. కేంద్రం నుంచి అధిక నిధులు తెచ్చి, ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, సీనియర్ నాయకులు గుర్రం మోహన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మమ్మద్ రియాజుద్దీన్, మాజీ జడ్పీటీసీ పంకజ, మాజీ ఎంపీపీ మచ్చ శంకరయ్య, దుర్గం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేయాలి

- అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్

నవతెలంగాణ-నస్పూర్



రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి నిబంధనల మేరకు నాణ్యమైన వరి ధాన్యం కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. శనివారం దండేపల్లి మండలం వెల్గనూర్‌లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే ట్యాగింగ్ చేయబడిన రైస్ మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. జిల్లాలో 262 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించడం జరిగిందని, ఇందులో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు 105, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 130, డీసీఎంఎస్‌కు 27 కొనుగోలు కేంద్రాలను కేటాయించడం జరిగిందని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సమన్వయంతో పని చేసి వరిధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించాలని తెలిపారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ సౌకర్యాల కల్పనతో పాటు ఎలక్ట్రానిక్ కాంటా, గన్నీ సంచులు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. దళారీ వ్యవస్థను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర పొందేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని కల్లాల్లో శుభ్రపర్చుకొని, తప్ప, తాలు, మట్టిగడ్డలు లేకుండా నిబంధనలకు లోబడి తేమ శాతం ఉండేలా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలని అన్నారు. రైతులు కొనుగోలు ప్రక్రియలో సందేహాలు, ఫిర్యాదుల కొరకు కంట్రోల్ రూమ్ 6303928682 నెంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఇంద్రవెల్లి అమరులకు ఘన నివాళి



నవతెలంగాణ-కాసిపేట


మండలంలోని దేవాపూర్ కొమరంభీం విగ్రహం వద్ద గిరిజన రైతాంగ పోరాటంలో అసువులు బాసిన అమరులకు 43వ సంస్మరణ దినం సందర్భంగా తుడుం దెబ్బ కమిటీ ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి అమరులకు ఘనంగా నివాళ్ల లర్పించారు. ఈ సందర్భంగా అమరుల చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్ల అర్పించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడె జంగు, నాయకపోడు సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల బాపు, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వెడ్మ కిషన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పేంద్రం హన్మంతు, మండల గౌరవ అధ్యక్షుడు ఆత్రం జంగు, అధ్యక్షుడు సంద్ర భూమయ్య, నాయక్‌పోడ్ సేవా సంఘం నాయకులు తత్ర భీంరావు, రెడ్డి లక్ష్మణ్, సోయాం సురు, మడావి ధర్మారావు, తొడసం సురేష్, సోమని పోశక్క, యూత్ నాయకులు సీడం జగన్, పెంద్రం విజయ్, కుర్సింగ రవి, సంతోష్, కోవ నాగరాజు పాల్గొన్నారు.

నిరాధారమైన ఆరోపణలు సరికాదు

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ఆర్కే-6 గని ఎలక్ట్రీషియన్ రమేష్ డీజీఎం పర్సనల్, ఎస్టేట్ అధికారులపైన నిరాధారమైన ఆరోపణలను ఖండిస్తున్నట్లు అధికారుల సంఘం నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంపెనీ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా ప్లాకార్డ్‌ను ప్రదర్శిస్తూ ఇద్దరి అధికారులపై ఆరోపణలు చేస్తూ బైఠాయించడం సరికాదని తెలిపారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న అధికారులు తమ తమ ఉద్యోగ బాధ్యతలను కంపెనీ నియమ నిబంధనలకు అనుగుణంగా ఎటువంటి రాగద్వేషాలకు లోను కాకుండా కంపెనీ పురోగాభివృది కోసం మాత్రమే పనిచేస్తారని వివరించారు. కేవలం అధికారులను ఇబ్బందులకు గురి చేయడానికి ఇటువంటి నిరాధార ఆరోపణలు చేయటం మూలంగా వారి మనోభావాలను దెబ్బతీయడమే అవుతుందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ప్రతిష్ఠ దెబ్బ తినడమే అని, ఇటువంటి నిరాధార ఆరోపణ చేయవద్దని శ్రీరాంపూర్ ఏరియా అధికారుల సంఘం తరపున విజ్ఞప్తి చేశారు.

పెంచుకున్న చెట్లే.. నరుక్కోవాల్సి వచ్చే..!



నవతెలంగాణ-జైపూర్

భీమారం-పోతన్‌పల్లి మధ్య రోడ్డు పొడవు నాటిన చెట్లకు గొడ్డలి వేటు తప్పడం లేదు. ముందు చూపు లేకుండా కరెంట్ లైన్ కింద చెట్లు నాటించడం విద్యుత్ సరఫరాకు సమస్యగా మారింది. అవెన్యూ ప్లాంటేషన్ కింద అటవీ అధికారులు చెట్లు నాటితే విద్యుత్ సరఫరా సమస్యను అధిగమించడం కోసం విద్యుత్ శాఖ అధికారులు ఆ చెట్లను నరికిస్తున్నారు. భీమారం నుంచి రెడ్డిపల్లి వరకు గల ప్రధాన విద్యుత్ లైన్‌లో ఏపుగా పెరిగిన చెట్లతో విద్యుత్ సరఫరాలో తరచు అంతరాయం ఏర్పడుతుంది. చెట్లు నరికితే తప్పా సమస్యకు పరిష్కారమార్గం లేకపోవడంతో కరెంట్ లైన్ కింద గల చెట్లను నరికిస్తున్నారు. గత పదేండ్ల క్రితం నాటించిన చెట్లను బతికించుకోవడం కోసం ట్రాక్టర్ ట్యాంకర్లతో నీరందించి రక్షించారు. విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు తలెత్తడంతో వాటిని నరుక్కోవల్సిన పరిస్థితి ఎదురైంది. ముందు చూపులేని అటవీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏపుగా పెరిగిన చెట్లను నరుకాల్సిరావడం బాధాకరమని పలువురు అభిప్రాయ పడుతున్నారు. చెట్లు నాటాలని పురమాయించిన అటవీ అధికారులు పనుల నిర్వాహణ పట్ల పర్యవేక్షన లేనందున పెంచిన చెట్లు తప్పనిసరై నరుక్కోవల్సి వస్తోందన్న అభిప్రాయాలు లేకపోలేదు. రోడ్డు పొడవు ఏపుగా పెరిగిన చెట్లు కరెంట్ తీగలను తగులుతున్నాయి. కరెంట్ లైన్ కింద కాకుండా అటూ ఇటుగా నాటివుంటే ఈ పరిస్థితి ఉండేది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భీమారం నుంచి దాంపూర్ వరకు విద్యుత్ సరఫరా చేస్తున్న ప్రధాన లైన్‌లో కింద చెట్లు నాటడం ద్వార తరచూ సమస్యలు ఏర్పడుతున్నాయని వారు పేర్కొంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటుతున్న తీరును అధికారులు అప్పుడే గుర్తించి ఉంటే ఇప్పుడు చెట్లు నరుకాల్సి వచ్చేదికాదు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరుగకుండా చెట్లు నాటుతున్నప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే పల్లెల అభివృద్ధి

నవతెలంగాణ-జైపూర్

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని పెద్దపల్లి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని నర్వ, ముదిగుంట, మిట్టపల్లి, కానుకూరు గ్రామాలలో స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి పర్యటించారు. ఈ సంధర్భంగా వివేక్ వెంకటస్వామి, వంశీకృష్ణ మాట్లాడుతూ బడుగు బలహీణ వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పని చేస్తుందని, లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అత్యదిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా వచ్చిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సమక్షంలో వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి మల్లేష్, బాగిరి సంపత్, బాల్కారి లింగయ్య, లచ్చయ్య, గోదారి రాయమల్లు, దూట నరేందర్, తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం తమ వంతుగా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫయాజోద్దీన్, రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మంతెన లక్ష్మన్, తిరుపతి రాజు, ముక్త శ్రీనివాస్, కల్కి రమేష్, మిట్టపల్లి లింగయ్య మనోహర్, నగేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని పల్లి (కే) గ్రామానికి చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మరణించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సుగుణాకర్ రెడ్డి(25)తో పాట స్నేహితుడు ఇద్దరు కలిసి శుక్రవారం రాత్రి విజయవాడకు 30 కిలోమీటర్ల దూరంలో మోటార్ సైకిల్‌ను ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో సుగుణాకర్ రెడ్డి మృతి చెందగా అయన స్నేహితుడికి తీవ్ర గాయాలయ్యాయి. సుగుణాకర్ రెడ్డి తీవ్ర గాయాలు రక్తస్రావం అధికం కావడంతో విజయవాడలోని పిన్నమనేని సిద్ధార్థ హాస్పిటల్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మరణించాడు. సుగుణక్క రెడ్డి విజయవాడలో ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కుమారుడి మరణంతో తల్లిదండ్రులు వామన్ రెడ్డి రోదనను పల్లి(కే) గ్రామస్తులను కంటతడి పెట్టించింది. కళ్ళ ముందే కొడుకు మరణించడంతో కుటుంబ సభ్యులు గ్రామస్తులు శోకసముద్రంలో మునిగిపోయారు.

కాంగ్రెస్ నాయకుడి కుటుంబాన్ని పరామర్శించి మంత్రి

నవతెలంగాణ-నేరడిగొండ



మండలం చించోలి గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు ఆత్రం భాస్కర్ సోదరుడు ఆత్రం రవీందర్ కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి చిత్ర పటానికి పుష్పాంజలి సమర్పించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్క, బోథ్ ఇన్‌చార్జి ఆడే గజేందర్, కుంరం కోటేష్, పసుల చంటి, కాంగ్రెస్ నాయకుడు ఆత్రం మహేందర్, మండల నాయకులు, కార్యకర్తలున్నారు.

దేశానికి గాంధీ పాలన కావాలి

- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఎంపీ ఎన్నికల సన్నహాక సమావేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

దేశానికి గాంధీ సిద్ధాంతంతో కూడిన పరిపాలన కావాల్సిన అవసరముందని పంచాయతీరాజ్, గృహనిర్మాణ, స్త్రీశిశుసంక్షేమ శాఖా మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క అన్నారు. శనివారం పట్టణంలోని రత్నా గార్డెన్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి మంత్రి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఎన్నో గొప్పగొప్ప సంస్కరణలను తీసుకొచ్చి బడుగు బలహీన వర్గాల కోసం పాటు పడిందని తెలిపారు. పదవులు త్యజించిన చరిత్ర గాంధీ కుటుంబానిదని అన్నారు. ప్రధాని అయ్యే అవకాశమున్నా ఇతరులకు ఆ పదవిచ్చి గౌరవించిన కుటుంబం గాంధీ కుటుంబానిదని కొనియాడారు. స్వలాభాపేక్షలేని రాహుల్ గాంధీ సొంతిల్లు కూడా లేని నిస్వార్ధ నాయకుడని కొనియాడారు. కాని ఛాయ్ వాలా అన్న మోడీ మాత్రం కోట్ల విలువైన సూట్లు వేసుకుంటున్నారని విమర్శించారు. ఈ దేశాన్ని మోదీ దోస్తులకు దోచి పెడుతున్నడని ఆరోపించారు. గత ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్టు రెండు కోట్ల ఉద్యోగాల ఊసేలేదని అన్నారు. అభివృద్ధి అడిగితే అక్షింతలు పంపిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆదిలాబాద్ మోడీ వచ్చినపుడు ఇక్కడి ప్రజలు నిధులిస్తడనుకుని సంతోష పడ్డారని కాని డ్రైనేజీ పనులు ప్రారంభించి పోయాడని విమర్శించారు. మోడీ రైతులకు రుణాలు మాఫీ చేయలేదని అన్నారు. బడా పారిశ్రామిక వేత్తలకు మాత్రం లోన్లు మాఫీ చేస్తడని విమర్శించారు. ఈనెల 22న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యే ఆదిలాబాద్ సభను జయప్రదం చేయాలని కోరారు.

మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

అనంతరం పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు సిడాం రాంకిషన్, తెలంగాణ కార్మిక సంఘ నాయకులు షేక్ బాబు, షేక్ అహ్మద్, ప్రమోద్ చౌదరి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, టీపీసీసీ కార్యదర్శి సత్తు మల్లేష్, మాజీ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, రేఖానాయక్, ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, నిర్మల్ జిల్లా అధ్యక్షులు శ్రీహరిరావు, బోథ్ ఇన్‌ఛార్జి ఆడె గజేందర్, ఆసిఫాబాద్ ఇన్‌ఛార్జి శ్యాం నాయక్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు శంతన్‌రావు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మీ ఆడబిడ్డను దీవించండి : ఆత్రం సుగుణ

75 ఏండ్ల తర్వాత తొలిసారి ఒక మహిళగా తనకు పోటీ చేసే అవకాశం దక్కిందని మీరందరు తనను ఓట్లతో ఆశీర్వదించి లోక్ సభకు పంపాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ప్రజలను కోరారు. తనను గెలిపిస్తే అన్ని వేళలా అందుబాటులో ఉంటానని ఆదిలాబాద్ అభివృద్ధికి పాటు పడతానని తెలిపారు.

సైనికుల్లా పని చేస్తాం : బల్మూరి వెంకట్

ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం సూచనల మేరకు తెలంగాణలో ఎంపీ అభ్యర్థుల విజయానికి సైనికుల్లా పని చేస్తామని అన్నారు. ఇందుకోసం అన్ని జిల్లాల ఎన్ఎస్‌యూఐ విభాగాలు శక్తి వంచ లేకుండా కృషి చేస్తాయని తెలిపారు. మొత్తం 17 స్థానాలలో 14 సెగ్మెంట్లలో విజయం సాధిస్తామన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

- యువతి మృతి, యువకుడి పరిస్థితి విషమం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పిప్పల్‌దరి గ్రామంలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో యువతి మృతి చెందగా, యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సయ్యద్ ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం..పిప్పల్‌దరి గ్రామానికి చెందిన యువతి అదే గ్రామానికి చెందిన భుజంగ్‌రావ్ ప్రేమించుకున్నారు. శనివారం గ్రామ శివారు పొలాలకెళ్లి పెండ్లి చేసుకున్నారు. అయితే అప్పటికే యువకుడి పెండ్లి జరిగి కొడుకు ఉన్నాడు. ఏమనుకున్నారో తెలియదు పెండ్లి చేసుకున్న తర్వాత అక్కడే పురుగులమందు తాగారు. గమనించిన స్థానికులు వారిని రిమ్స్‌కు తరలిస్తుండగా యువతి మార్గమధ్యలో మృతి చెందింది. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న భుజంగ్‌రావ్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

పది కిలోల గంజాయి స్వాధీనం

నవతెలంగాణ-తాంసి

గంజాయి విక్రయిస్తున్న వారి వద్ద నుంచి పది కిలోల గంజాయిని భీంపూర్ ఎస్సై జి.ప్రదీప్ కుమార్ పట్టుకున్నారు. శనివారం రాత్రి సమయంలో ఎస్సై సిబ్బందితో కలిసి గోళ్లఘాట్ గ్రామాలతో పాటు పలు గ్రామాలలో సోదాలు నిర్వహించారు. ఇందులో ముగ్గురు వ్యక్తులు గంజాయి అమ్ముతుండగా వారిని పట్టుకున్నారు. దాదాపు రూ.రెండు లక్షల రూపాయల విలువ గల పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించిన్నట్లు ఎస్సై తెలిపారు

సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 22న పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలోని డైట్ కాలేజీ గ్రౌండ్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించనున్న సభా స్థలాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క శనివారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధాన వేదిక, జనం ప్రవేశించే మార్గాలు తదితర విషయాలను నియోజకవర్గ ఇన్‌ఛార్జీలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 21 సాయంత్రంలోగా పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. సభ విజయవంతమయ్యేలా ఇన్‌ఛార్జీలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, టీపీసీసీ కార్యదర్శి సత్తు మల్లేష్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, రేఖానాయక్, నిర్మల్ జిల్లా అధ్యక్షులు శ్రీహరిరావు, ఆదిలాబాద్ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, బోథ్ ఇన్‌ఛార్జి ఆడె గజేందర్, ఆసిఫాబాద్ ఇన్‌ఛార్జి శ్యాం నాయక్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు శంతన్ రావు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్రం భాస్కర్‌ని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని చించోలి గ్రామానికి చెందిన ఆత్రం రవీందర్ ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం వారి స్వగ్రామానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో పాటు మండల నాయకులు ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మెన్ రవీందర్ రెడ్డి, వడూర్ ఎంపీటీసీ పండరి పాల్గొన్నారు.

బోథ్ : మండలంలోని పిప్పల్‌ధరి గ్రామానికి చెందిన ఆత్రం గంగారాం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ కుటుంబ సభ్యులకు పరామర్శించారు. మృతి గల కారణాలు అడిగి తెలుసుకోసి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆయన వెంట మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, నేరడిగొండ ఎంపీపీ సజన్, రుక్మన్ సింగ్, సురేందర్, శ్రీధర్, సుభాష్, పండరీ, నరేందర్, బుచ్చన్న, రవీందర్, పాల్గొన్నారు.

విద్యార్థుల్లో గుణాత్మకమైన మార్పులు రావాలి

నవతెలంగాణ-బోథ్

విద్యార్థుల్లో గుణాత్మకమైన మార్పులు తీసుకువచ్చేందుకు పరీక్షలు నిర్వహించినట్టు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుమేర్ పాషా అన్నారు. మండల కేంద్రంలోని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాలలోని ఎఫ్ఏ సేట్, నీట్ మోడల్ పరీక్షను నిర్వహించారు. దాదాపు 100 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు మున్సిఫ్, మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఉమేష్, ఏఐఎస్ఎఫ్ సభ్యులు నరేష్, ముక్రం పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి రూ.30 వేల విరాళం

నవతెలంగాణ-బోథ్

మండలంలోని కానుగుట్ట గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలల అభివృద్ధికి గ్రామ అభివృద్ధి కమిటీ నుంచి శనివారం ఒక్కోక్క పాఠశాలకు రూ. 15 వేలు గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ నవ్వ రవి చేతుల మీదుగా విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థుల కోసం అభివృద్ధితో పాటు మౌలిక వసతులకు విరాళాన్ని అందించడం జరగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోశెట్టి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాకేష్ కుమార్, ఉపాధ్యక్షులు శంషోద్దిన్, రైటర్ నారాయణ, ఉపాధ్యాయులు చిలుక సతీష్, సునీల్, రవి, సీతారాం, సుదర్శన్ గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల అస్వస్థత ఘటనకు కారకులపై కఠిన చర్యలు

నవతెలంగాణ-నిర్మల్

విద్యార్థుల అస్వస్థత ఘటనకు కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఈఓ రవీందర్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నర్సాపూర్ కేజీబీవీ పాఠశాలలో కలుషిత ఆహారం వల్ల కడుపు నొప్పితో బాధపడుతూ అస్వస్థతకు గురైన 22 మంది విద్యార్థులను ప్రాథమిక చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేయడం జరిగిందని, విద్యార్థులంతా క్షేమంగా ఉన్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కలుషిత ఆహార ఘటనకు సంబంధించి, విధులలో నిర్లక్ష్యం కారణంగా ఘటనకు బాధ్యులైన విద్యాలయంలో పనిచేస్తున్న ముగ్గురు సహాయ వంట మనుషులను తొలగించడం జరిగిందన్నారు. ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేయడం జరిగిందన్నారు. అలాగే జిల్లా విద్యా శాఖా కార్యాలయంలో పని చేస్తున్న జెండర్ కోఆర్డినేటర్‌ను మాతృ శాఖకు రీ ఫ్యాట్రీయేట్ చేస్తూ, రిలీవ్ చేయడం జరిగిందని తెలిపారు. గతంలో మూడవ తేదీన సైతం జరిగిన ఇలాంటి ఘటనకు బాధ్యులుగా కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, ప్రధాన వంట మనిషిని తొలగించామని గుర్తు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సిబ్బంది జాగ్రత్త వహించాలని, లేని పక్షంలో బాధ్యులపై కలెక్టర్ ఆదేశాల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

- ఉపాధిహామీ ప్రజా వేదిక

నవతెలంగాణ-తాంసి



ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న 14 విడత ప్రజా వేదిక

ఉపాధి హామీ చటం పనులకు సంబంధించిన 2023-24 సంవత్సరాలు సంబంధించిన 14 విడత ప్రజా వేదిక శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో 13 గ్రామపంచాయతీలకు సంబంధించిన రూ. 1కోటి 61లక్షల 49 వేల 840 రూపాయల నిధుల తనిఖీ నివేదిక ప్రతులను అసిస్టెంట్ డైరెక్టర్ కుటుంబరావు తనిఖీ బృందం వివరించారు. కొన్ని గ్రామ పంచాయతీల్లోని మాస్టర్లలో కూలీల సంతకాలు లేకుండా కూలీలకు చెల్లింపులు జరిగాయి. వ్యవసాయ చేనులో రాళ్ల కట్టలకు సంబంధించిన కొలతల్లో సరిగా లేకపోవడం పనులకు సంబంధించిన ఫోటోలు పూర్తి స్థాయిలో లేనట్టు తనిఖీ బృందం వివరించారు. తాంసిలో మరణించిన వ్యక్తి గౌరుబాయి పేరున ఐదు వారాల వరకు పేమెంట్ జరిగినట్లు వివరించారు. పల్లె ప్రకృతి వనంలో గత సంవత్సరం నాటిన మొక్కలు యాభై శాతం ఎండిపోవడం జరిగింది. పాలోడి గ్రామ పంచాయతీల్లో రూ.70 వేల రాళ్ల కట్టల పనుల్లో అవకతవకలు జరిగినట్లు నివేదికలో తెలిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ కుటుంబరావు మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పనులకు సంబంధించిన కూలీలను పెంచాలని అన్నారు. జాబ్ కార్డ్ కలిగిన ప్రతి కూలీకి పనులు కలిపించాలని అన్నారు. పని ప్రదేశంలో పనులకు సంబంధించిన పూర్తి స్థాయి ఫోటోలు ఉండాలని అన్నారు. నెమ్‌బోర్డ్‌లు ఎర్పాటు చేసుకోవాలని అన్నారు. కార్యదర్శులు పనులను పరిశీలించాలన్నారు. కూలీల సంతకాలు మాస్టర్లలో పరిశీలించిన తర్వాత సంతకం చేయాలని అన్నారు. సిబ్బంది అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, ఏపీడీ కృష్ణారావు, ఎస్‌టీఎం వేణు, కవిత, ఎంపీఓ స్వప్న శీలా, ఏపీఓ విజయ, ఉపాధి సిబ్బంది.

జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి

- మంత్రి సీతక్కకు జేఏసీ వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. ఈ విషయమై శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్కను జేఏసీ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని, కుమురంభీం స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం ద్వారా నిర్వహించే పోటీ పరీక్షలను సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా ఆయా జిల్లా కేంద్రంలోనే పోటీ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిడం సాయికుమార్, కుమ్ర అశోక్, ఏఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అశోక్, ఏఐఎస్‌ఫ్ జిల్లా కార్యదర్శి నవీన్, టీఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ, సంతోష్, అనసూయ, అశ్విని, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు తబ్రేజ్ ఖాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సుజయ్, నాగరాజ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో కడెం మండలంలోని లింగాపూర్ మాజీ సర్పంచ్ బీజేపీ ఓబీసీ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్‌తో పాటు మాజీ సర్పంచ్ గొల్ల రాజన్న, మాజీ ఉపసర్పంచ్ రాజారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గంగమల్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికీ కండువా కప్పి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కడెం మండల అధ్యక్షుడు తుమ్మల మల్లేష్, సీనియర్ నాయకుడు పడిగెల భూషన్ ఉన్నారు. మండలంలోని ఐబీ, లక్కారాం, శాంతినగర్, బోయవాడ కాలనీలకు చెందిన 40 మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ వారికి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూబ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనకు ఆకర్షితులై బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బిరుదుల లాజర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అచ్చ దేవానందం, మాజీ మండల అధ్యక్షుడు దూట రాజేశ్వర్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ సలీం, టౌన్ ప్రెసిడెంట్ ఎండి ఇమ్రాన్, సీనియర్ నాయకులు అయ్యుబ్ ఖాన్, సయ్యద్ నిసార్, మహబూద్ పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మెన్ బీఆర్ఎస్ నుంచి సస్పెండ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు ఆయనపై సస్పెండ్ వేటు వేసినట్లు పేర్కొన్నారు. ఉద్యమ కాలం నాటి బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని స్పష్టం చేసిన ఆయన పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.

ఉపాధి హామీ కూలీల డబ్బులు చెల్లించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఉపాధి హామీ కూలీల డబ్బులు చెల్లించాలని, అంకోలి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అధికారులను ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. ఉపాధి హామీ కూలీల డబ్బులను పాత బకాయి కింద కట్ చేసుకోవడంతో కూలీలు తమ దృష్టికి తీసుకువచ్చారని, పాత బకాయిల కింద కట్ చేసుకోవద్దని కోరారు.

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 22న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. శనివారం భద్రతా చర్యల్లో భాగంగా హెలిప్యాడ్ బహిరంగ సభాస్థలి, ముఖ్యమంత్రి ప్రయాణించే రూట్‌మ్యాప్‌ను ప్రత్యక్షంగా పరిశీలించి సిబ్బందికి ఎటువంటి భద్రత చర్యల్లో లోపాలు లేకుండా సూచనలు చేశారు. అదేవిధంగా సోమవారం పట్టణంలోని "ఐ లవ్ ఆదిలాబాద్" ప్రాంతం నుంచి, కొండా లక్ష్మణ్ బాపూజీ చౌరస్తా నుంచి జగ్జీవన్ చౌక్, కలెక్టర్ చౌరస్తా వరకు పూర్తిగా ఆంక్షలు ఉంటాయని, శాంతినగర్ మీదుగా వినాయక్ చౌక్ రోడ్డును వినియోగించుకోవాలని సూచించారు. రిమ్స్ నుంచి బస్టాండ్ వరకు ఒకవైపు రెండు రాకపోకలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్‌చౌక్, వినాయక చౌక్ వరకు పూర్తిగా ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నందున ప్రజలు పట్టణంలోని అంతర్గత రోడ్లను వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లే దారి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు పాక్షికంగా సాధారణ వాహనాలకు, ప్రజలకు అనుమతి ఉండదన్నారు. సభకు హాజరయ్యి ప్రజలకు బైక్లు, కార్లు, ఆటోలకు పార్కింగ్ ప్రదేశాలుగా గౌతమి మోడల్ స్కూల్, వినాయకచౌక్ కాటన్‌మిల్ దగ్గర ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్సులకు టీటీడీసీ ఎదురుగా ఉన్న మైదానం, స్థానిక ఎరోడ్రం మైదానం, ఆర్టీసీ డిపోలను వాడుకోవాల్సిందిగా తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు సి సమయ్ జాన్‌రావు, బి.సురేందర్ రావు, డీఎస్పీలు జీవన్‌రెడ్డి, పి.శ్రీనివాస్, ప్రకాష్, సీఐలు కే సత్యనారాయణ, ఫణిదర్, చంద్రశేఖర్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ నవీన్ సిబ్బంది పాల్గొన్నారు.

చేతి గుర్తుతోనే మార్పు సాధ్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

చేతి గుర్తుతోనే మార్పు సాధ్యమని, హస్తం గుర్తుకు ఓటేద్దామని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సుగుణను భారీ మెజారిటీతో గెలిపించుకుందామని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మావల గ్రామంలో గడప గడప తిరుగుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలనలో రోజు రోజుకు నిత్యావసర, వంట గ్యాస్, పెట్రోల్ ధరలు పెరిగిపోతూ సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయని అన్నారు. మరోమారు బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దుచేసి రిజర్వేషన్లు రద్దుచేస్తామని అనడం అణగారినవర్గాల హక్కులను హరించినట్లేనని మండిపడ్డారు. సామాన్యుడిని అన్నిరకాలుగా మోసంచేస్తున్న బీజేపీకి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పి కష్టపడే నాయకురాలు ఆత్రం సుగుణను అత్యధిక మెజార్టీతో పార్లమెంటుకు పంపి ఆశిర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మావల మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, నలిమెల నవీన్‌రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నాగరాజ్, సురేష్, ప్రభాకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి శనివారం ఇంద్రవెల్లిలోని హీరాపూర్ స్థూపం వద్ద ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్, జంగిల్ జమీన్ నినాదంతో అప్పటి పాలకుల, దోపిడీ సహించలేక పోరాడి అమరులైన ఉద్యమవీరుల వీర చరిత్రను జాతి ఎన్నడూ మరువలేనిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, వారి అభ్యున్నతికి తానూ సైతం ఎల్లవేళలా కృషిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్రం సక్కును అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆత్రం సక్కును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ గంగ్రత్ రమేష్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ ప్రచారంలో భాగంగా మండలంలోని పిప్పల్‌ధరి, దయిగూడ, మామిడిగూడ, కోరి, గ్రామ ఓటర్లను ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అభివృద్ధి చేసిందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సెవ్వ జగదీష్ యాదవ్, ఆరే నరేష్, భూమన్న, సుదర్శన్, చంద్రజి, బుచ్చన్న, కిష్టయ్య, మధు పాల్గొన్నారు.